క్లుప్తంగా

నేడు మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవం

మొయినాబాద్: మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం మొయినాబాద్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మండల అధ్యక్షుడు మహేందర్ మాదిగ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ సోదరులు ఈ కార్యక్రమానికి తరలివచ్చి అమరులకు నివాళులర్పించాలని కోరారు.

ఆలయానికి వెండి ధార పాత్ర బహూకరణ


వెండి ధార పాత్రను అందజేస్తున్న వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్: మండల పరిధిలో ఎలికట్ట గ్రామంలో ఉన్న అంబభవానీ మాత దేవాలయానికి మొగిలిగిద్ద గ్రామానికి చెందిన కక్కునూరి వెంకటేశ్‌గుప్తా రూ.3లక్షల విలువ చేసే 2.8 కిలోల వెండి ధార పాత్రను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముత్యాల రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

షాబాద్: గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం చేవెళ్ల నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహేష్‌యాదవ్, రమేష్ యాదవ్, ధనుంజయ్, నర్సింహులు, నాయకులు రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


తాళిబొట్టు చూపుతున్న పూజారి

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో ఉన్న శ్రీ మహాలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సుధాకర శర్మ, కోటప్ప, మహాలింగం, కుమారస్వామి, మఠం చంద్రశేఖర్ పంతుళ్లు వేదమంత్రోచ్చారణలతో క్రతువును నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైకుంఠ రథం అందజేత


వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి, యాదయ్య

చేవెళ్ల: మండలంలోని ప్రజలకు మంగలి బాల్‌రాజ్, సినిమా టాకీస్ నారాయణల సహకారంతో వారి కుమారులు యాదగిరి, దామోదర్ యాదవ్‌లు ఉచిత వైకుంఠ రథాన్ని అందజేశారు. శుక్రవారం మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు ప్రారంభించారు. పేద ప్రజలు, అనాథలకు వారి చివరి క్షణాల్లో అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ రథాన్ని అందుబాటులోకి తీసుకు రావటం అభినందనీయన్నారు. మండల నాయకులు పాల్గొన్నారు.

బాలికలకు యుద్ధ విద్యలు అవసరం


కేజీబీవీలో విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొందుర్గు: విద్యార్థులు చదువుతోపాటు యుద్ధ విద్యలో రాణించాలని ఎంఈఓ కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. ఇటీవల ఆదిలాబాద్ నిర్వహించిన కరాటే పోటీల్లో చౌదరిగూడ కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ కిరణ్‌కుమార్ రెడ్డి హాజరై మాట్లాడారు. ముఖ్యంగా బాలికలు యుద్ధ విద్యలో నైపుణ్యం పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాగసుధ, ఉపాధ్యాయులు శోభ, హరిష, లత, అంజలి, అరుణ, ప్రమీల, ప్రశాంతి, అపర్ణ, సుమలత, మాధవి, రజిని పాల్గొన్నారు.

వసతులు ఉండవు.. సమస్యలు తీరవు


కొత్తూరు పట్టణంలో గదులు లేక ఆరుబయట చదువుకుంటున్న చిన్నారులు

పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఉపయోగపడే అంగన్‌వాడీ కేంద్రాలు వసతులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఫలితంగా కేంద్రాల పరిసరాలు అపరిశుభ్ర వాతావరణంతో నిండిపోయాయి.

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు
- మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొత్తూరు: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తుంది. ఇక్కడ 03–05 ఏళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన చదువును అందిస్తున్నారు. ఆహ్లాద వాతావరణంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలు పేద పిల్లలకు దేవుడిచ్చిన వరంగా కనిపిస్తాయి. ప్రస్తుతం అవి అసౌకర్యాలు, అపరిశుభ్రతకు నిలయంగా తయారయ్యాయి. దీంతో అక్కడ చదువుకునే చిన్నారుల భవిష్యత్తు, ఆరోగ్యవంతమైన ఎదుగుదల ప్రశ్నార్థకంగా మారింది.

ఉన్నతాధికారులకు నివేదిస్తా

మండలంతో పాటు కొత్తూరు మున్సిపాలిటీలో ఉన్న కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ప్రస్తుతం అద్దె లేని ప్రభుత్వ భవనాలు, గదుల్లో కొనసాగుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో టాయిలెట్స్, మరికొన్ని కేంద్రాలకు విద్యుత్ సరఫరా లేదు. మండలంలో కొనసాగుతున్న కేంద్రాల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తా.

– రేవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కొత్తూరు

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అనుకున్న లక్ష్యాన్ని సాధించడం లేదు. కొత్తూరు మండలంలో మొత్తం 31 కేంద్రాలు కొనసాగుతున్నాయి. మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 1,168 మంది ఉన్నారు. ప్రసుత్తం అన్ని కేంద్రాల్లో సమస్యలు నెలకొన్నాయి.

సౌకర్యాల లేమి

మండలంలో కొనసాగుతున్న పలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికీ సొంత భవనాలు కరువయ్యాయి. కొన్ని కేంద్రాలు ఆయా కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లోని అదనపు గదుల్లో కొనసాగుతున్నాయి. మరికొన్ని కేంద్రాల్లో కనీసం మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ కనెక్షన్ లేని స్థితిలో ఉండడంతో బాల్యం దుర్భరంగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీల్లో గదులు కొరత నెలకొంది. ఫలితంగా చిన్నారులను ఆరుబయటే కూర్చోబెట్టి విద్యాబుద్ధులు నేర్పుతున్న దుస్థితి దాపురించింది. తల్లిదండ్రులు సైతం వసతులు లేని కేంద్రాలకు ఎలా తమ పిల్లల్ని పంపాలని మదనపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వేడుకొంటున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు


క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) ఎంతో ఉపయోగపడుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం చేవెళ్ల, షాబాద్ మండలాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కోసమే ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని చెప్పారు. అత్యవసర సమయంలో అభాగ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మొత్తం రూ.10.97 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, సురేందర్, ఆగిరెడ్డి, వీరేందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, పాండు, శ్రీనివాస్‌గౌడ్, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్లు

కేశంపేట: పెండింగ్ జీతాలు చెల్లించాలని మండల, గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని వాపోయారు. గ్రామ పంచాయతీ వెబ్ పోర్టల్, నెలవారీ పనులు, కొత్త అసైన్‌మెంట్, మ్యూటేషన్లు, జనన మరణాల పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలలో డాటా ఎంట్రీ పనులు చేయడంలో కీలకంగా ఉన్న తమకు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమకు వెంటనే జీతాలు చెల్లించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి విధులకు దూరంగా ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీకాంత్, మమత తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. దోపోత్సవం

శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అశ్వవాహన సేవ


స్వామివారిని ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్తున్న భక్తులు

చేవెళ్ల: శివరాత్రిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం అర్ధరాత్రి దోపోత్సవం ఘట్టం కనుల పండువగా సాగింది. స్వామివారు అశ్వవాహన సేవపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో ప్రత్యేకంగా చెంచు జాతికి చెందిన వారు స్వామివారి నగలను దొంగిలించి అలివేలు మంగమ్మకు అప్పగించే ఘట్టం అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అలివేలు సమేత వేంకటేశ్వర స్వామిని ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లారు. వేల సంఖ్యలో భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. దోపోత్సవ కార్యక్రమానికి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. చేవెళ్ల సీఐ భూపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.


పూజలు చేస్తున్న మహేందర్‌రెడ్డి, యాదయ్య

దైవచింతన అలవర్చుకోవాలి

ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు దర్శించుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ పూజారులు, ఎండోమెంట్ అధికారులకు వారు సూచించారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

మల్లారెడ్డిగూడలో పశు వైద్య శిబిరం

షాబాద్: రైతులు వ్యవసాయంతో పాటు పాడి సంపదను వృద్ధి చేసుకోవాలని షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతోపాటు సాధారణ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల కోసం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందని చెప్పారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపశువులను పెంచుకోవాలన్నారు. పశుగ్రాసం పెంచి వాటికి ఆహారంగా ఇస్తే పాలశాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బలరాం, కృష్ణ, సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ వీఆర్‌ఓకు నివాళి

కొందుర్గు: మాజీ వీఆర్‌ఓ భీమ్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణా రెడ్డి తండ్రైన భీమ్‌రెడ్డి మృతిచెందడంతో ఎమ్మెల్యే శుక్రవారం మండలంలోని ఆగిర్యాల గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భీమ్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే ప్రార్థించినట్లు తెలిపారు.

కొందుర్గు కేజీబీవీలో వార్షిక వేడుకలు

కొందుర్గు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నిస్సీ షేభినా పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు ఉపన్యాసం, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. వేడుకల్లో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అనురాధ, ఉమాదేవి, రజిత, శిరీష, స్వప్న, రాఘవేంద్రమ్మ, పల్లవి, శారధ, ఆరాదన, కల్పన పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: రోజూ పాఠశాలకు వచ్చి పాఠాలు వినే విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు. తమ తోటి మిత్రులకు పాఠాలు బోధించి గురువుల నుంచి అభినందనలు అందుకున్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈఓగా చరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడిగా విఘ్నేశ్వర్, ఉపాధ్యాయులుగా భానుప్రియ, నిఖిత, వర్షిణి, రవళిక, రమ్య, ప్రణీత్, రమణ, హర్ష, పల్లవి, అక్షిత వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి సత్యం, పారిజాత, సీఆర్పీ భాగ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండలాగరా... బసవా

షాబాద్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సాయిరెడ్డిగూడలో ఎద్దులతో బండలాగుడు పోటీలు శుక్రవారం నిర్వహించారు. మొత్తం పోటీల్లో 13 జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటా శివరాత్రి పండుగ సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గోపాల్‌కు రూ.70వేలు, రెండో బహుమతి రషీద్‌పాషా రూ.60వేలు, మూడో బహుమతి వెంకటేశ్వర్‌రావు రూ.50 వేలు, నాలుగో బహుమతి చంద్రకళ రూ.40వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్‌రెడ్డి, శంకరయ్య, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, విఠలయ్య, లక్ష్మయ్య, తదితరులున్నారు.



పరీక్ష సామగ్రి పంపిణీ

నందిగామ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన సదర్ శ్రీను శుక్రవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని, ఒక ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారులు మెరుగైన జీపీఏ సాధించాలన్నారు. అనంతరం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ బాటిళ్లు తదితర సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్

షాద్‌నగర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ... బీసీల పాలన సమాజానికి ఎంతో అవసరమన్నారు. బీసీల అభివృద్ధిని ప్రోత్సహించే వారికే ఓటు వేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నాయన్నారు. ప్రజలు రాజకీయ పార్టీల నేతలు ఇచ్చే హామీలకు మోసపోకుండా వాస్తవానికి దగ్గరగా ఉండే నాయకులను ఎన్నుకోవాలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలు రాణించాలంటే అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖరప్ప, నరేష్, చందులాల్, శివ, శంకర్, రవి, వరప్రసాద్, సురేందర్‌గౌడ్, సాయిలు, వెంకటేష్, భద్రప్ప, శివకుమార్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్: భగవంతుడు శివుడి రూపంలో భూమిపై అవతరించి స్వర్గాన్ని స్థాపించాడని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు బీకే లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్, నాగర్‌గూడలో శివజయంతి సందర్భంగా శాంతి జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగ ద్వారా మానసిక ఒత్తిడికి గురి కాకుండా చేస్తుందన్నారు. ఆత్మ, పరమాత్మ గురించి క్లుప్తంగా వివరించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. రోజు రోజుకూ మానవతా విలువలు తగ్గి దేశంలో అశాంతి నెలకొంటుందన్నారు. పూర్వకాలంలో దేవాలయాలు.. భగవంతుడి ఆరాధనకే కాకుండా న్యాయం చెప్పడం, విద్య తదితర కార్యక్రమాలకు నెలవుగా ఉండి ధర్మ పరిరక్షణ కోసం నిలిచేవన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


శాంతి సందేశం ఇస్తున్న బీకే లక్ష్మి

దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి



షాబాద్: ఆర్థికంగా వెనుకబడిన దర్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టైలర్స్ అసోసియేషన్ సభ్యులు గాండ్ల వీరేష్, సాజీద్‌పాషా కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రపంచ టైలర్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తమకు రుణాలు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రమేష్, రామస్వామి, నరేందర్, ప్రవీణ్‌చారి, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

భావితరానికి స్ఫూర్తి సీవీ రామన్

ఘనంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవం


షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: నేటి విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తూ భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా సూచించారు. సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కళాశాలలో జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. మనం నేర్చుకున్న విద్య దేశానికి, సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు. అనంతరం సైన్స్ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. చించోడ్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్, పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్, పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సైతం సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు.

సైన్స్ ప్రయోగాలు

కొందుర్గు: కొందుర్గు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతోపాటు, చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొందుర్గు గీతాంజలి హైస్కూల్‌లలో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు చేసి వివరించారు.

విజ్ఞాన ప్రదర్శనలతోనే మేధస్సు

షాబాద్: విజ్ఞాన ప్రదర్శనలతోనే విద్యార్థులకు మేధస్సు పెంపొందుతుందని మన్‌మర్రి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యయురాలు అనురాధ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు

మొయినాబాద్: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడానికి దోహదపడతాయని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.


షాబాద్: మన్‌మర్రి ప్రాథమిక పాఠశాలలో..


కొందుర్గు: చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో..


మొయినాబాద్: కనకమామిడి జెడ్పీ పాఠశాలలో..